# మురళీ స్వరం

-కాలిపు వీరభద్రుడు

ఆ మాటలు విన్న మురళి ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. వెంటనే వెనక్కి తిరిగి చూసాడు. ఇద్దరు మహిళలు పెళ్లివారి నడకతో మాట్లాడుకుంటూ పార్కులోకి వస్తున్నారు.

'ఆ మాటలన్న మహిళ ఇందులో ఎవరో?' ఓ మూలగా కూర్చున్న మురళి అనుకున్నాడు.

ఆ మహిళలిద్దరూ తనను దాటి ఇంకా ముందుకు పోతున్నారు. వాళ్ల వెనుకనే ఓ అబ్బాయి ఆరేళ్లుంటాయేమో... వస్తున్నాడు మురళి ఊదుకుంటూ. మురళిని సరిగ్గా పలికించలేక నానా తంటాలూ పడుతున్నాడు. ఎలా పలికించాలో చెప్పమని వాళ్లమ్మని అడుగుతున్నాడు.

అందులో ఒకామె సమాధానం చెబుతోంది. ఆమె ఆ పిల్లాడి తల్లి అయ్యుండాలి. ఆ సమాధానమే ఇందాక తనకు వినిపించిన మాటలు. ఇప్పడు పిల్లాడితో చెబుతున్న ఈ మాటలూ ఇందాకటి మాటలూ ఒకటే అయినా అప్పటి మాటల్లో మునుపున్నంత కరుకుదనంలేదు. అది చాలా నిష్కర్షగా ఉన్నాయి. నిర్మోహమాటంగా ఉన్నాయి. ఇప్పటి మాటలు మృదువుగా, మధురంగా సముదాయించే ధోరణిలో ఉన్నాయి.

"చూడు బాబూ! మనం ఒక పని చేసేటప్పుడు ముందుగానే ఆలోచించుకోవాలి నేనీ పని చేయగలనా లేదా? అని. పలికించలేనివాడివి ఎందుక్కొనాలి దానిని? అర్థం చేసుకో. రూపాయి వేస్ట్ చేసావు. దాన్ని ఊదడం నాకు రాదు. ఎలాగో నువ్వే తంటాలు పడు"

ఆ మాటల్ని విన్నాక మురళికి వెంటనే ఒక విషయం గుర్తుకొచ్చింది. ఆ తరువాత మరొకటి...మరొకటి. దేని గురించి ముందు ఆలోచించాలో అంతుబట్టక వాళ్లనలా చూస్తూ ఉండిపోయాడు మురళి.

వాళ్లు మోడరన్ మహిళలు. విలాసంగా వయ్యారాలు ఒలకబోస్తూ నడుస్తున్నారు. అందులో ఒకామె సరళలా ఉందే! ఉందేమిటి సరళే.

ఆ మాటల కరుకుదనం, ఆ నడక అంతా ఆమే.

అయితే అప్పటికంటే కొంచెం ఒళ్లు చేసింది. ఆ ఒళ్లు ఆమె అందాన్ని పెంచింది. మురళి ఆలోచిస్తున్నాడు.

సరళది నాటికీ నేటికీ ఒకటే మాట. ఆమె అభిప్రాయమూ అదే. ఏమాత్రం మారలేదు. ఆనాడు పదవ తరగతి పూర్తయిన తరువాత ఏమిటి చేస్తావంటే ఏమిటి చేస్తావని ఒకర్ని ఒకరం అడిగేము.

"నాదేముంది. మా నాన్నగారు ఏది చదవమంటే అదే చదువుతాను. అయినా ముందుగా ఆలోచించుకోవడానికి ఏముంది? ఇంటర్, బిఎ... అలా చదువుతూ పోవడమే. ఆ తరువాత ఆలోచిద్దాం" అని ఆనాడు సరళతో తానన్నాడు. కానీ సరళ మాటలు తనకు ఈనాటికీ గుర్తున్నాయి.

"నేను మాత్రం ఆలోచించకుండా ఏ పనీ చేయను మురళీ. నా చదువు ఇంతటితో సరి. ఇకనుంచి స్వయంవరానికి రాకుమారులు వేట ప్రారంభించాలి. ఆ తరువాత పెళ్లి చేసుకుంటాను. కట్టుకున్నవాడు ఇష్టపడితే ఒక్క బిడ్డతోనే ఫుల్‌స్టాప్ పెడతాను. లేదా మరొక్క సంతానం అంతే" తన జీవితం ఎలా వుండాలో సరళ ముందుగానే ఆలోచించుకుంది.


మురళి ఆలోచిస్తున్నాడు. అయితే ఆ అబ్బాయి సరళ కొడుకన్నమాట. అన్నట్లుగానే సరళ ఒక్క సంతానంతోనే కుటుంబ నియంత్రణ అమలుపరచినట్లుగా ఉంది. ఇంకా చిన్నవాళ్లు వుండి ఉంటే ఉంటే ఆరేళ్లు వచ్చిన అబ్బాయిని గారాబంగా తన వెంట తిప్పుకోదు. సరళ ఎంత హుందాగా, అందంగా ఉంది. నేనూ ఉన్నాను ఎందుకు?

చదువు పూర్తి కాకముందే పెళ్లి చేసుకున్న పరమమూర్ఖుడ్ని. ఉద్యోగం రాకముందే ఇద్దరు పిల్లల్ని కన్న దౌర్భాగ్యుడ్ని. భవిష్యత్తు జీవితం గురించి ముందుగా ఏ నిర్ణయమూ తీసుకోకుండా అందమైన జీవితాన్ని అతి భయంకరంగా మార్చుకున్న అప్రయోజకుడ్ని. ఏమిటి చదవాలి. ఏం చదివితే ఏ ఫలితమొస్తుంది? ఆ ఫలితంపై జీవితమెలా ఆధారపడి వుంటుంది. ఏ విధమైన ఆలోచన లేకుండా ఏదో చదివి బిఏ అనిపించుకుని ఏ ఉద్యోగం లేక నానా తంటాలు పడుతున్న చవటని.

"ముందు చదవ్వోయ్. తరువాత చూద్దాం ఏం చేయాలో" అనే నాన్నగారి మాటనే ఆనాడు నాకు మార్గదర్శకాలయ్యాయి. చివరకు ఏ ఆలోచన, ఏ గమ్యమూ లేకుండా జీవితంలోకి అడుగుపెట్టేసాను చచ్చి స్వర్గానవున్న నాన్నమ్మ దయవల్ల. నా పెళ్లయితేగాని ఆమె చావదట. ఆమె హాయిగా ఉందక్కడ. నేనే ఈ జీవన పోరాటంలో అనుక్షణం ఛస్తూనే వున్నానిక్కడ.

పైసా సంపాదించలేని మొగుడ్ని పెళ్లాం సతాయింపు.









ఊరికే తిని తిరగడం తప్ప పొలంలోకైనా వెళ్ల లేని సోమరిపోతునని ఈమధ్యనే తండ్రితోపాటు గళం విప్పిన తల్లి నిరసన. పిల్లలింకా పెద్దవాళ్లు కాలేదు కాబట్టి బతికిపోయాను. వాళ్లింకా నన్ను నిలదీయలేదు మీరు మాకు కల్పించిన సౌకర్యాలేమిటా అని.

ఆనాడు నాన్నగారు నన్ను పొగిడారు పదవ తరగతి ఫస్ట్‌క్లాసులో పాసయ్యానని. కానీ నేననుకున్న గ్రూపు చదవలేకపోయాను ఇంటర్‌లో. అక్కడా పోటీ పెరిగింది. నాకంటే మార్కులెక్కువ వచ్చిన వాళ్లు ఎంతోమంది ఉన్నారు. ఇక నాలాంటివాడికి కోరుకున్న గ్రూపులో సీటెలా దొరుకుతుంది? అలాగే డిగ్రీలో కూడా నేననుకున్న చదువు చదవలేకపోయాను.

నేను చదివిన చదువేమో ఈనాడు నా జీవితానికి పనికి రాకుండా పోయింది. ముందుగానే ఒక ఆలోచనకు వస్తే నా జీవితం ఈ విధంగా చుక్కాని లేని నావలా ఉండకపోను. కానీ సరళ... ఆమె నాలాగా కాదు. ముందుగానే ఆలోచించుకోవాలి అనే విషయాన్ని సరళ తన కొడుక్కి ఇప్పటినుంచే ఎంత చక్కగా తెలియజేస్తోందో!

సరళ ఒక టీచరై వుంటే ఎంతో మంది మంచి విద్యార్థుల్ని తద్వారా మంచి పౌరుల్ని తయారు చేసి ఉండేది.

మేము పదవ తరగతి చదువుతున్నప్పుడు మా మాస్టారు కూడా మనం ఏ పని చేసినా బాగా ఆలోచించి చేయాలనేవారు.

మనమొక పని చేసే ముందు ఆ పనిని చేయడానికి తగిన శక్తి సామర్థ్యాలు మన వద్ద ఉన్నదీ లేనిదీ మొదట్లోనే తెలుసుకోవాలనుకునేవారాయన. అతను మాట్లాడుతూ ఉంటే 'తర్వాత' అనే పదం పదేపదే దొర్లుతూ ఉంటుంది.

ఆనాడు మా కుర్రాళ్లంతా 'తర్వాత మాస్టారు' అంటూ ఆయన్ని హేళన చేసేవాళ్లం. బాధపడితేగానీ బోధపడదని పెద్దలందుకే అంటూ ఉంటారు. పెద్దలేది చెప్పినా అనుభవంతో చెబుతారు. పిన్నవారు ఆ మాటల్ని విని ఓపికతో అనుసరిస్తే వాళ్ల జీవితాలు మంచి దారిలో పడతాయి అని నాకిప్పుడు తెలిసివచ్చింది.

ఆ మాస్టారు సందర్భం వచ్చినప్పుడల్లా క్లాసులో చెబుతూ ఉండేవారు. "చూడండబ్బాయిలూ. మన గమ్యాన్ని చేరుకోవడం కోసం బాగా ఆలోచించి తరువాత ఇప్పుడే ఓ మార్గాన్ని ఎన్నుకోవాలి. తరువాత బయలుదేరి కొంతదూరం వెళ్లాక తరువాత అది సరైనది కాదని తర్వాత మరొకటి ఆ తరువాత అదీ మంచిది కాదని తర్వాత ఇంకొకటి... ఇలా మార్గాలు తర్వాత మార్చుకుంటూ పోతే తర్వాత

మనం అనుకున్న చోటుకు తర్వాత చేరడం మనకి కష్టమవుతుంది'' అత నలా చెబుతూ ఉంటే 'తర్వాత' అనే అతని పద ప్రయోగం మాకెంతో నవ్వు పుట్టించేది.

ఆ పదం వాక్యంలో అనేకసార్లు దొర్లేది. అసలతను తర్వాత అనే పదం తోనే మాట్లాడడం ప్రారంభిస్తారు.

ఆ తర్వాతలో వున్న అర్థం ఇప్పుడు నాలాగ ఎంతమందికి అనుభవం లోకి వచ్చిందో! తర్వాత ఆలోచించడం సరైన పద్ధతికాదు. పనిని ప్రారం భించడానికి ముందుగానే ఆలోచించాలి అని మాస్టారు చెప్పిన మాటలు ఆనాడు నేను విని ఆ ప్రకారం నడిచివుంటే ఈనాడు నా జీవితం ఇలా ఉండే దికాదు.

పదవ తరగతి పాసయిన తరువాత ఆయన దగ్గరకు వెళ్లి "మీ దయవల్ల పాసయ్యాను మాస్టారు'' అని చెప్పాను.

"తర్వాత... అదే చాలా సంతోషం. తర్వాత ఏం చేయాలనుకుంటు న్నావు?'' నన్నడిగారు.

"ఇంటర్ చదువుతాను'' అన్నాను.

"మంచిది. తరువాత? అదే ఆ తరువాత ఏం చేస్తావు?'' అడిగారు.

"చదవడమో, ఏ ఉద్యోగమో...'' గొణిగాను.

"తర్వాత... అంటే ఆ తర్వాత గురించి ఇప్పుడు ఏమీ ఆలోచించలేద న్నమాట. తర్వాత...చూడు బాబూ ఆ తర్వాత ఏ ఉద్యోగం చేయాలను కుంటున్నావో, ఆ తర్వాత నీ జీవితం ఎలా వుండాలనుకుంటున్నావో దానికి తగిన చదువు ఇప్పుడు చదువుతున్నానా లేదా అనే విషయాన్ని ఆ తర్వాత ఆలోచించేకంటే ఇప్పుడే ఆలోచించాలి. తర్వాత...నీ అభిరుచినిబట్టి జీవి తాన్నో, ఉద్యోగాన్నో ఎన్నుకుని ఆ మార్గంలోంచి ప్రయాణం సాగిస్తే అంటే అలాంటి చదువే చదువుకుంటే నువ్వనుకున్న గమ్యానికి సులభంగా చేరవచ్చునుగదా'' అని ఆయన అన్నారు.

ఆ మాస్టారు ఇప్పుడెక్కడున్నారో, ఏ ఊళ్లో పని చేస్తున్నారోగానీ ఆయన మాటల్ని విని ఎంతోమంది విద్యార్థులు తమ జీవితాల్ని హాయిగా గడుపుతూ ఉంటారు. సరళే అందుకు ఉదాహరణ.

కానీ నేను ఆయన మాటల్ని పాటించలేదు. పెడచెవిన పెట్టాను. ఈనాడు నా జీవితమిలా ఒడిదుడుకుల్లో పడిపోయిందందుకే.

ఆలోచిస్తున్న మురళి సరళ దగ్గరకు వెళ్లాలని బెంచీమీదనుంచి లేచాడు.

కానీ తన వ్యర్థ జీవితం గురించి సరళకు తెలిసిపోయే సందర్భం మాటల్లో రావచ్చునని ఆ ప్రయత్నం మానేసాడు. ఇప్పుడైనా ఆ మస్టారు చెప్పిన ప్రకారం నడుచుకోవాలని మురళి నిశ్చయించుకున్నాడు. ఆ మాస్టారి 'తర్వాత' అనే మాట మురళీస్వరంలా మధురంగా తోచింది ప్పుడు మురళికి.

ప్రభుత్వంవారు రైతులకు అనేకరకాల సదుపాయాలు కల్పిస్తున్నారు. వ్యవసాయాభివృద్ధికి ఎన్నో విధాలుగా సహాయం అందజేస్తున్నారు. రాయి తీలు కల్పిస్తున్నారు.


చదువుకున్న వాళ్లంతా ఉద్యోగాలు చేయాలని ఎక్కడ ఉంది? మాకున్న ఆ కొద్దిపాటి పొలాన్ని చక్కగా పండించుకుంటాను. హాయిగా బ్రతుకుతాను.

ముసలితనంలో నాన్నగారు పొలం పనులు చూసుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఇకనుంచి నేనే పొలం పనులు చూసుకుంటాను. నాన్నగారి సలహాలు తీసుకుంటాను. వ్యవసాయం పనులకు సంబంధించిన అనేక విషయాలు పత్రికల్లో చెబుతున్నారు. టీవీల్లో చూపిస్తున్నారు. మురళి ఒక నిర్ణయానికి వచ్చాడు. ఇప్పుడు మనస్సుకెంతో హాయిగా ఉందని మురళి అనుకున్నాడు.

పార్కులో అప్పుడే విద్యుద్దీపాలు వెలిగాయి. ఆ వెలుగులోంచి రోడ్డు మీదకొస్తున్నాడు మురళి.

వెనుకనుంచి ఆ అబ్బాయి మురళీ స్వరం నాకు మనోహరంగా వినిపిం చసాగింది.

★



## బెన్‌హర్ రియాలిటీ రేస్

యాభై ఏళ్లనాడు విడుదలై అనేక ఆస్కార్ బహుమతుల్ని గెల్చుకున్న 'బెన్‌హర్' సినిమాలో నాలుగేసి గుర్రాలు కట్టిన బగ్గీల పందెపు సీను ఆ చిత్రానికి హైలెట్ అన్న సంగతి తెలిసిందే. ఇటీవల సిడ్నీ ఒలింపిక్ స్టేడి యంలో ఆనాటి బగ్గీల రేస్‌ని మళ్లీ రియాలిటీ షోగా నడిపి చరిత్రను పున రావృతం చేసారుట.

